# సునామీ హెచ్చరిక వ్యవస్థ సిద్ధం

## రూపొందించిన హైదరాబాద్ సంస్థ

హైదరాబాద్: సునామీ ప్రమాదం పొంచి ఉన్నప్పుడు ముందుగానే హెచ్చరించే ఓ వ్యవస్థను భారత్ సొంతంగా అభివృద్ధి చేసింది. హైదరాబాద్‌లోని జాతీయ సముద్ర పరిశోధన, సేవల కేంద్రం (ఐఎన్‌సీఓఐఎస్) ఈ పరిజ్ఞానాన్ని రూపొందించింది. ఈ కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు ఇటీవలే గుజరాత్ తీరం వెంబడి.. సముద్ర అంతర్భాగ ఒత్తిడిని నమోదు చేసే పరికరాలు (బీపీఆర్), సునామీని గుర్తించే సెన్సార్లను నెలకొల్పారు. బంగాళాఖాతంలో ఇప్పటికే నాలుగు బీపీఆర్ పరికరాలను ఏర్పాటు చేసినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. బంగాళఖాతం, అరేబియా సముద్ర తీర ప్రాంతాల్లో సునామీ సంభవించే ప్రమాదమున్న రెండు జోన్లను గుర్తించినట్లు ఐఎన్‌సీఓఐఎస్ డైరెక్టర్ శైలేష్ నాయక్ శనివారమిక్కడ తెలిపారు. సముద్ర అంతర్భాగంలో భూకంపం ఏర్పడిన 30 నిమిషాలలోపే సునామీ హెచ్చరికలు జారీ చేసే పరిజ్ఞానాన్ని కనుగొన్నామని ఆయన చెప్పారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థను ఈనెల 15న కేంద్ర శాస్త్రసాంకేతిక, సముద్ర అభివృద్ధి శాఖ మంత్రి కపిల్ సిబాల్ ప్రారంభించే అవకాశాలున్నాయి.